సాక్షి
రంగారెడ్డి
గురువారం । 28 । మార్చి । 2024




చైర్మన్ ఎన్నికకు గ్రీన్‌సిగ్నల్

హైకోర్టు ఆదేశాలతో ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికకు ఎన్నికల కమిషన్ పచ్చజెండా ఊపింది. 8లో▸



సొంతింటి కల.. చెదిరేలా!

ఇల్లు కట్టి చూడు, పెళ్లి చేసి చూడు అని పెద్దలు ఊరికే అనలేదు. ప్రస్తుతం రెండింటికి ఖర్చులు అధికమవుతున్నాయి. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
గురువారం సాయంత్రం 6:34	శుక్రవారం ఉదయం 4:51

న్యూస్‌రీల్

మానవ అక్రమ రవాణాను అడ్డుకుందాం

ఆమనగల్లు ఐసీడీఎస్ సీడీపీఓ రోజా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీడీపీఓ రోజా, అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆమనగల్లు: మానవ అక్రమ రవాణాపై ప్రజలకు అవగాహన అవసరమని ఆమనగల్లు ఐసీడీఎస్ సీడీపీఓ రోజా సూచించారు. పట్టణంలోని రైతువేదిక భవనంలో ప్రజ్వల సంస్థ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మానవ అక్రమ రవాణాపై శిక్షణ ఏర్పాటు చేశారు. బుధవారం ప్రారంభించిన కార్యక్రమంలో సీడీపీఓ మాట్లాడుతూ.. సమాజంలో ఆడపిల్లలపై అమానుష చర్యలు జరుగుతున్నాయని ఇందులో అక్రమ రవాణా ఒకటన్నారు. వయసు, లింగబేధం లేకుండా ఆర్థిక, అవయవ, లైంగిక స్వలాభం కోసం రవాణా చేయడం తీవ్రమైన నేరమన్నారు. ప్రజలకు అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల సంస్థ బృందం సభ్యులు సురేశ్, అనిల్, అంబర్‌సింగ్, మిధిలారాజ్ మానవ అక్రమ రవాణాపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణాపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.30 లక్షల విరాళం



ఆగిరెడ్డి, వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న కురుమ సంఘం సభ్యులు

చేవెళ్ల: ఆలయ నిర్మాణానికి దాతలు ఇచ్చే విరాళం వారి ఔదార్యాన్ని చాటుతాయని చేవెళ్ల కురుమ సంఘం నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మల్లన్న ఆలయ నిర్మాణానికి మాజీ సర్పంచ్ బంగారి శైలజాఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి రూ.30లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారిని సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. దాతలు ఆలయాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల కురుమ సంఘం నాయకులు ఉన్నారు.

పోలీసుల అదుపులో టిప్పర్ డ్రైవర్

యాచారం: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆకులామైలారం గ్రామంలో బాలుడి మృతికి కారకుడైన టిప్పర్ డ్రైవర్‌ను పోలీసులు మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ ఇస్మాయిల్ మధ్యాహ్నం టిప్పర్‌తో బైక్‌ను ఢీకొట్టడంతో 14 ఏళ్ల బాలుడు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువతి నందిని తీవ్ర గాయాలతో బయటపడింది. ప్రస్తుతం ఆమె ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ప్రమాదానికి కారుణమైన టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఫార్మాసిటీ ఠాణా ఎస్‌ఐ నరేశ్ తెలిపారు.

జాబ్ మేళాలో 65మందికి ఉద్యోగాలు



జాబ్ మేళాలో పాల్గొన్న కళాశాల సిబ్బంది, విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాలలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో 65 మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ ప్రభు తెలిపారు. నవతా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ నిర్వహించిన జాబ్ మేళాలో 200 మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. వీరిలో 65 మంది వేర్‌హౌస్ సూపర్‌వైజర్లుగా, డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా ఉద్యోగాలు పొందారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్ సమన్వయకర్త డా. పి.విజయలక్ష్మి, కెరీర్ డవలప్‌మెంట్ సమన్వయకర్త డా.బి.రజిత, ఐక్యూఏసీ సమన్వయకర్త డా.పి.పద్మజ, ఆకాడమిక్ కోఆర్డినేటర్ డా.జి.నాగోజీ, టీఎస్‌కే సెంటర్ బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దండుల బరి.. గెలుపుపై గురి

పోరులో బలమైన అభ్యర్థులు

- చేవెళ్ల, మల్కాజ్‌గిరి స్థానాలపై రేవంత్‌రెడ్డి, కేటీఆర్ స్పెషల్ ఫోకస్
- సెగ్మెంట్ల పరిధిలో ముఖ్యనేతలతో సమీక్షలు
- కారు దిగి కాంగ్రెస్‌లో చేరుతున్న నేతలు
- గులాబీ కేడర్‌లో ఆత్మస్థైర్యం నింపే పనిలో పార్టీ పెద్దలు
- వ్యూహాత్మకంగా ముందుకెళ్తున్న కమల దళం



సాక్షి, రంగారెడ్డి జిల్లా: చేవెళ్ల, మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానాలను ఇటు కాంగ్రెస్, అటు బీఆర్‌ఎస్‌లు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. చేవెళ్ల బీఆర్‌ఎస్‌కు, మల్కాజ్‌గిరి కాంగ్రెస్‌కు సిట్టింగ్ సీటు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ఇక్కడ ఎంపీగా గెలుపొందారు. ప్రస్తుతం ఆయన చేవెళ్లకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. సీఎం ఈ రెండు సీట్లను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎలాగైనా హస్తగతం చేసుకునేందుకు పావులు కదువుతున్నారు. ఇందులో భాగంగా చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి సహా మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, రంగారెడ్డి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డిలను పార్టీలోకి తీసుకువచ్చారు. కారు స్పీడుకు బ్రేకులు వేయడంతో పాటు బీఆర్‌ఎస్ కేడర్‌ను నిర్వీర్యం చేయడంలో కొంత సక్సెస్ అయ్యారు. ఇక బీఆర్‌ఎస్ సైతం ఈ రెండు స్థానాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. గత రెండు ఎన్నిక(2014, 2019)ల్లోనూ చేవెళ్ల నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోనూ మెజార్టీ ఎమ్మెల్యే స్థానాలు బీఆర్‌ఎస్సే గెలుచుకుంది. ఈ రెండు చోట్ల సంస్థాగతంగా ఆ పార్టీ బలంగా ఉంది. పార్టీకి కంచుకోటలైన ఈ రెండు స్థానాల్లో ఎలాగైనా విజయం సాధించి తీరాలని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ భావిస్తున్నారు. ముఖ్య నేతలు ఒక్కొక్కరుగా కారు దిగుతున్నా.. క్షేత్రస్థాయి కేడర్‌కు అండగా ఉండేందుకు కేటీఆర్ రంగంలోకి దిగారు. రోజుకో నియోజకవర్గం ముఖ్య నేతలతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నూరిపోస్తున్నారు. వలసలను నిలువరించే ప్రయత్నం చేయడంతో పాటు మళ్లీ మనమే గెలుపొందుతున్నామనే ప్రచారాన్ని బలంగా తీసుకెళ్తున్నారు. బీజేపీ సైతం రెండు స్థానాల్లో బలమైన అభ్యర్థులను బరిలోకి దించింది. ఇప్పటికే ప్రధాని మోదీ మల్కాజ్‌గిరిలో రోడ్ షో నిర్వహించారు.

13న చేవెళ్లలో బీఆర్‌ఎస్ బహిరంగ సభలు

అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం చవి చూసిన బీఆర్‌ఎస్.. పార్లమెంట్ ఎన్నికల్లో పట్టు నిలుపుకొనేందుకు వ్యూహ రచన చేస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ కేంద్రంగా ఉన్న చేవెళ్ల, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్ లోక్‌సభ స్థానాల్లో పార్టీకి మంచి పట్టు ఉంది. 2014లో ఇదే స్థానం నుంచి కొండా విశ్వేశ్వర్ రెడ్డి గెలుపొందారు. ఆ తర్వాత ఆయన పార్టీని వీడి.. కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ప్రస్తుత సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి (2019) ఇటీవలే కారు దిగి కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. ప్రస్తుతం ఆయన కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నారు. పార్టీకి నమ్మక ద్రోహం చేసిన రంజిత్‌రెడ్డిపై స్థానికంగా బలమైన సామాజికవర్గానికి చెందిన కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను బరిలోకి దించింది. అదే విధంగా ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది, సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దానం నాగేందర్‌ను సైతం ఓడించి తీరాలనే లక్ష్యంతో ఆయనకు పోటీగా మాజీ మంత్రి పద్మారావు గౌడ్‌ను బరిలోకి దింపారు. పట్నం దంపతులకు రాజకీయంగా చెక్ పెట్టాలనే ఉద్దేశంతో స్థానికంగా అందరికీ సుపరిచితమైన రాగిడి లక్ష్మారెడ్డిని మల్కాజ్‌గిరి స్థానం నుంచి టికెట్ కేటాయించారు. పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఏప్రిల్ 13న చేవెళ్ల కేంద్రంగా భారీ బహిరంగ సభకు నిర్ణయించింది. పార్టీ అధినేత కేసీఆర్ ఈ సభకు హాజరై..కేడర్‌లో ఆత్మస్థైర్యాన్ని నింపనున్నారు.

తుక్కుగూడ నుంచి కాంగ్రెస్ శంఖారావం

తెలంగాణలోని 17 లోక్‌సభా స్థానాల్లో 14 స్థానాలు గెలుపొందాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ముందుకు సాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల ముందు తుక్కుగూడ వేదికగా నిర్వహించిన భారీ బహిరంగ సభ, ఆ తర్వాత లభించిన ఫలితాలను స్ఫూర్తిగా తీసుకుని మళ్లీ అదే వేదికగా ఏప్రిల్ ఆరు లేదా ఏడు తేదీల్లో మరో భారీ సభకు సన్నాహాలు చేస్తోంది. ఇదే వేదికగా జాతీయ స్థాయి గ్యారంటీలను ప్రకటించాలని నిర్ణయించింది. చేవెళ్ల, మల్కాజ్‌గిరి సహా సికింద్రాబాద్, మహబూబ్‌నగర్‌ల నుంచి భారీగా జనసమీకరణకు కసరత్తు చేస్తోంది. రెండు రోజుల క్రితం పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం ముఖ్య నేతలతో భేటీ కాగా, బుధవారం మల్కాజ్‌గిరి నేతలతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ కేడర్‌కు దిశానిర్దేశం చేశారు. చేవెళ్ల నుంచి సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డిని, మల్కాజ్‌గిరి నుంచి పట్నం సునీతారెడ్డిని, సికింద్రాబాద్ నుంచి ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను బరిలోకి దించి, ప్రత్యర్థి పార్టీలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు.

ప్రధాని చరిష్మానే బీజేపీ ప్రచారాస్త్రం

చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సహా మల్కాజ్‌గిరి అభ్యర్థి ఈటెల రాజేందర్, సికింద్రాబాద్ అభ్యర్థి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రధాని మోదీ చరిష్మానే నమ్ముకుని పోటీకి దిగారు. గత పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేసుకుంటున్నారు. ఇప్పటికే జాతీయ అగ్రనాయకత్వం ఆయా నియోజకవర్గాల్లో పర్యటించింది. రోడ్‌షోలు, బహిరంగ సభలతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లతో పోలిస్తే బీజేపీ ప్రచారంలో ఒకింత వేగంగా దూసుకుపోతోంది. చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చేవెళ్ల ప్రజా ఆశీర్వాద యాత్ర గురువారం నుంచి ప్రారంభించబోతున్నారు. పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ కేంద్రాల్లోనూ ఆయన పాదయాత్రగా ప్రచారం చేయనున్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల అవినీతి, అనైతిక విధానాలను ప్రధానంగా ప్రచారం చేయనున్నారు. గతంలో ఆయన కారుగుర్తుపై పోటీ చేసి పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రెండు స్థానాల్లో ఓడిన ఈటల రాజేందర్‌కు బీజేపీ అధిష్టానం మల్కాజ్‌గిరి స్థానం కేటాయించింది.

నేడే ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

- పోలింగ్‌కు సర్వం సిద్ధం
- ఏప్రిల్ 2న ఫలితం



షాద్‌నగర్ ఎంపీడీఓ కార్యాలయం

ఆమనగల్లు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఉప ఎన్నిక పోలింగ్ ఈనెల 28న జరగనుంది. ఇప్పటికే అధికారులు పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు షాద్‌నగర్ ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఓటింగ్‌లో పాల్గొనేందుకు ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక గుర్తింపు కార్డును అందించినట్లు ఆమనగల్లు ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్ తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ నుంచి జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి నవీన్‌రెడ్డి బరిలో నిలిచారు. జిల్లా వ్యాప్తంగా 1,439 ఓటర్లుండగా నాలుగు మండలాల్లో కలిసి 60 మంది ఓటర్లున్నారు.క్యాంపు నుంచి ఓటింగ్‌కు నాలుగు మండలాల్లో 60 ఓట్లుండగా బీఆర్‌ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులతో కలిసి గోవా క్యాంపులో ఉండగా.. కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు షామీర్‌పేట్‌లోని రిసార్ట్స్‌లో ఉన్నట్లు సమాచారం. వీరు ఆయా క్యాంపుల నుంచి నేరుగా ఓటేసేందుకే రానున్నట్లు తెలుస్తోంది.

నాలుగు మండలాల ఓటర్ల వివరాలు

మండలం	ఓట్లు
ఆమనగల్లు	21
మాడ్గుల	15
కడ్తాల	11
తలకొండపల్లి	13
మొత్తం	60

రీ పోలింగ్‌కు ఆస్కారం ఇవ్వొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక



శిక్షణలో పాల్గొన్న మాస్టర్ ట్రైనర్స్

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఎన్నికల విధులు పూర్తి అవగాహనతో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా.. రీపోలింగ్‌కు ఆస్కారం లేకుండా సజావుగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో కలెక్టర్ శశాంక అధ్యక్షతన జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్స్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాస్టర్ ట్రైనర్లు ప్రతీ అంశంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రిసైడింగ్ అధికారులకు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చేప్పుడు వారి సందేహాలను నివృత్తి చేయాలని.. అందుకు ముందుగా తాము (డీఎంఎల్‌టీలు, ఏఎల్‌ఎంటీలు) తీసుకుంటున్న శిక్షణలోని ప్రతీ అంశంపై పట్టు ఉండాలన్నారు. శిక్షణ ద్వారా అవగాహన చేసుకున్న ప్రక్రియను ఎన్నికల విధుల్లో పూర్తి స్థాయిలో వినియోగించేలా ఉండాలని సూచించారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు విద్యార్థులకు చేసే బోధనలా ఉండాలన్నారు. శిక్షణకు హాజరై ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు క్యూఆర్ కోడ్ ద్వారా హాజరు తీసుకోవాలన్నారు. శిక్షణకు హాజరయ్యే ప్రతీ ఒక్కరు ఈవీఎం ఆపరేటింగ్ చేసేలా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. మాక్‌పోల్ నిర్వహణ, ఈవీఎం ఆపరేట్ చేయడం, ప్రిసైడింగ్ అధికారుల విధులు, బాధ్యతలను, ప్రీపోల్, పోలింగ్ తర్వాత చేయాల్సిన పనులు విడమర్చి చెప్పాలని, నిబంధనలను వివరించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్‌ఓ సంగీత, డీఈఓ సుశీంధర్‌రావు, జిల్లా స్థాయి అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్స్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పీఏసీఎస్ చైర్మన్ పాండురంగారెడ్డికి ధ్రువపత్రాన్ని అందజేస్తున్న డీసీఓ ధాత్రిదేవి

'ఉప్పరిగూడ' ఉత్కంఠకు తెర

- పీఏసీఎస్ చెర్మన్‌గా పాండు రంగారెడ్డి, వైస్ చైర్మన్‌గా చంద్రశేఖర్‌రెడ్డి
- ఏకగ్రీవమైన ఎన్నిక

ఇబ్రహీంపట్నం: ఉప్పరిగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా ఎదుళ్ల పాండు రంగారెడ్డి, వైస్ చైర్మన్‌గా కంబాలపల్లి చంద్రశేఖర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శేరిగూడ పీఏసీఎస్ కార్యాలయంలో బుధవారం జిల్లా కో–ఆపరేటీవ్ అధికారిణి ధాత్రిదేవి సమక్షంలో ఈ ఎన్నికను నిర్వహించారు. ఈ సొసైటీకి చైర్మన్‌గా ఉన్న టేకుల సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్మన్ క్యామ శంకర్‌లపై అవిశ్వాసం పెట్టి తొలగించిన విషయం విదితమే. సుదర్శన్‌రెడ్డి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వాదనలు విన్న కోర్టు కేసును డిస్మిస్ చేసింది. దీంతో డైరెక్టర్లు ఈనెల 22న పాండురంగారెడ్డిని తాత్కాలికంగా ఇన్‌చార్జి చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో అధికారికంగా చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను కో–ఆపరేటీవ్ అధికారులు చేపట్టారు. సుదర్శన్‌రెడ్డి సైతం కొత్త చైర్మన్‌గా పాండు రంగారెడ్డి ఎన్నికకు ప్రతిపాదించడం గమనార్హం. అయనతో పాటు గుర్రం సుధాకర్‌రెడ్డి బలపరిచారు. మిగిలిన 10 మంది డైరెక్టర్లు మద్దతు తెలపడంతో పాండురంగారెడ్డి ఎన్నిక ఏకగ్రీవమైంది. అదేవిధంగా వైస్ చైర్మన్‌గా కంబాలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నికకు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎదుళ్ల జంగారెడ్డిలు బలపరచగా మిగిలిన సభ్యులు మద్దతివ్వడంతో చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నిక సైతం ఏకగ్రీవమైంది. దీంతో రెండు నెలలుగా కొనసాగిన ఉత్కంఠకు తెరపడినట్లైంది.

కారు సీటు కాంగ్రెస్ ఖాతాలోకి..

గతంలో చైర్మన్, వైస్ చైర్మన్‌లు బీఆర్‌ఎస్‌కు చెందిన వారుండగా ఇప్పుడు ఆ రెండు పదవులు కాంగ్రెస్ ఖాతాలో పడ్డాయి. దీంతో హస్తం శ్రేణులు పాండురంగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానించి అభినందనలు తెలిపారు. ఘనంగా సంబురాలు నిర్వహించారు.

రికార్డు ధర పలికిన పసుపు

సాక్షి, సిటీబ్యూరో: పసుపు ధరలకు రెక్కలొచ్చాయి. నగరంలోని మలక్‌పేట్ మార్కెట్‌లో పసుపు ధర బుధవారం క్వింటాల్‌కు రూ.12 వేలకుపైగా పలికింది. గతంలో పోలిస్తే ఈ మధ్య పసుపు విక్రయాలు నగరంలో భారీగా జరుగుతున్నట్లు వ్యాపారులు అంటున్నారు. యాంటీబయాటిక్స్ గుణాలు ఎక్కువగా ఉండే పసుపును వంటలతో పాటు మందుల రూపంలో కూడా వినియోగించడంతో పసుపు వాడకం పెరిగింది. రోజూ దాదాపు 150 క్వింటాళ్ల పసుపు అవసరం ఉండగా.. నగర మార్కెట్లకు 100 క్వింటాళ్ల పసుపు మాత్రమే దిగుమతి అవుతునట్లు మార్కెట్ లెక్కలు చెబుతున్నాయి. దీంతో డిమాండ్‌కు తక్కువ సరఫరాతో ధరలు విపరితంగా పెరిగాయి. కరోనా కంటే ముందు పసుపు కేజీ ధర రూ. 120 ఉండగా ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కేజీ ధర రూ. 180– 200 పలుకుతోంది. డిమాండ్ ప్రకారం సరఫరా జరగకపోతే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

నిధులు మంజూరు చేయించినా..

అభివృద్ధి చేయలేకపోయారు


- నేటి నుంచి ప్రజా ఆశీర్వాద యాత్ర
- బీజేపీ చేవెళ్ల అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: చేవెళ్ల పార్లమెంటు సభ్యుడిగా ఉన్నప్పుడు జాతీయ రహదారి బీజాపూర్ హైవేకు రూ.937 కోట్లు మంజూరు చేయిస్తే ఇప్పటి వరకు అభివృద్ధి చేయలేదని మాజీ ఎంపీ, బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిఓని అజీజ్‌నగర్ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లోక్ సభ ఎన్నికల సందర్భంగా పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్‌లలో ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ యాత్ర గురువారం ఉదయం 7.30గంటలకు శంషాబాద్ మండల పరిధిలోని నర్కూడ సీతా రామ చంద్రస్వామి క్షేత్రం అమ్మపల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర నర్కూడ మీదుగా మల్కారం నుంచి సాగుతూ చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలంలోకి ప్రవేశిస్తుందన్నారు. షాబాద్ నుంచి పరిగి, తాండూర్, వికారాబాద్, చేవెళ్ల, రాజేంద్రనగర్, మహేశ్వరం, నియోజకవర్గాల్లో 14 రోజుల పాటు అన్ని గ్రామీణ, మండలాల్లో యాత్ర కొనసాగుతుందని చెప్పారు. ప్రధాని మోదీ పదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తామన్నారు. ప్రతీ ఒక్కరు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. జీఓ 111 ఎత్తివేస్తామని సడలింపులో భాగంగా జీవో 69 తెచ్చి రియల్ ఎస్టేట్, ఫామ్‌హౌజ్‌లను అభివృద్ధి చేసుకున్నారని ఆరోపించారు. కాళేశ్వరం, పాలమూరు రెండు ప్రాంతాలను పర్యటించానని కానీ ఆ నీళ్ల చేవెళ్ల ప్రాంతానికి రావడం కష్టమన్నారు. ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. చేవెళ్ల నుంచి 4లక్షల మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, భీమేందర్‌రెడ్డి, శ్రీకాంత్, మాధవరెడ్డి, పరిగి పరమేశ్వర్‌రెడ్డి, శేరిలింగంపల్లి రవియాదవ్, రాజేంద్రనగర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, చేవెళ్ల వెంకట్‌రెడ్డి, డాక్టర్ వైభవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్తం పరమాత్మమయం



సభలో ప్రసంగిస్తున్న పరిపూర్ణానందస్వామి



ప్రవచనాలు వింటున్న భక్తులు

- ఇది తెలుసుకున్న వారంతా సర్వజ్ఞులే
- తల్లిదండ్రులు, గురువులను పూజించాలి
- దైవ చింతనను అలవర్చుకోవాలి
- వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందస్వామి
- ముగిసిన సనాతన వేదాంత జ్ఞానసభలు

బడంగ్‌పేట: సమస్తం పరమాత్మమయం అనే విషయం తెలుసుకున్న వారు సర్వజ్ఞులని పూజ్యశ్రీ వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందస్వామి అన్నారు. ప్రతిఒక్కరూ తల్లిదండ్రులను, గురువులను, భగవంతుడిని పూజించాలని, సదా దైవ చింతన అలవర్చుకోవాలని ఆయన సూచించారు. బాలాపూర్‌లో నిర్వహిస్తున్న సనాతన వేదాంత జ్ఞానసభల ముగింపు సందర్భంగా బుధవారం నిర్వహించిన సభలో స్వామి మాట్లాడుతూ.. మన శక్తి కొలది దానధర్మాలు, యజ్ఞాలు చేయాలని అవే మనల్ని కాపాడతాయని చెప్పారు. అహింస గొప్పదని, ఆ మార్గాన్ని ఆచరించాలని అన్నారు. ఈ సందర్భంగా భగవద్గీత 18 అధ్యాయాలలోని ముఖ్య శ్లోకాలు, మానవ జీవితానికి అవసరమైన మార్గదర్శకాలను వివరించారు. అనంతరం పుష్పగిరి సంస్థాన పీఠాధిపతులు విద్యా నృసింహ భారతీ స్వామి ఉపన్యసించారు. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పీఠాధిపతులు, మఠాధిపతులు, మాతాజీలు సనాతన ధర్మం గురించి ప్రసంగించారు. ఈ సందర్భంగా జ్ఞాన సభలను విజయవంతం చేసిన వారందరికీ పరిపూర్ణానంద స్వామి కృతజ్ఞతలు తెలిపారు. సభల ముగింపు సందర్భంగా చండీహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజ్యశ్రీ అభిషేక చైతన్య స్వామి, అప్రమేయానందగిరి స్వామి, శ్రీ అసంగానందస్వామి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టూరిజం డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, సరాబు లక్ష్మణ్‌గుప్తా, బొప్పన కృష్ణ ప్రసాద్, పాండు గుప్తా, దయాకర్ గుప్తా, నాగభూషణం, భక్తులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఈతకు వెళ్లి..

బావిలో మునిగి కార్మికుడి మృతి

కందుకూరు: మద్యం మత్తు కాయాకష్టం చేసుకునే ఓ కార్మికుడిని పొట్టన పెట్టుకుంది. సరదాగా ఈత కొట్టడానికి బావిలో దిగిన వ్యక్తి నీట మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మక్బూల్‌జానీ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లేమూరు పరిధిలోని ఓ ఫాంహౌస్‌లో చేపట్టిన నిర్మాణ పనులు పూర్తవడంతో సదరు కాంట్రాక్టర్ పని చేసిన వారికి మంగళవారం రాత్రి విందు ఇచ్చాడు. కాగా హైదరాబాద్, మలక్‌పేటలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నివసిస్తున్న ఏపీలోని శ్రీకాకుళం జిల్లా సరబూజుల మండలం పెద్దపాలెం గ్రామానికి చెందిన శైలద దుర్గారావు(54)



మృతుడు దుర్గారావు

కూలీ పనులకు వచ్చి విందులో పాల్గొన్నాడు. అనంతరం మద్యం మత్తులో రాత్రి సమయంలో అక్కడే ఉన్న బావిలో ఈత కొట్టడానికి దిగాడు. ఈ క్రమంలో అకస్మాత్తుగా బావిలో నీట మునిగి మృతి చెందాడు. విషయాన్ని గుర్తించిన తోటి కార్మికులు అతన్ని బయటకు తీసే ప్రయత్నం చేసి విఫలమయ్యారు. బుధవారం ఉదయం మృతదేహం బయటికి తేలింది. శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు ఎస్‌ఐ శ్రావణ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విధుల్లో అలసత్వం.. వేటుకు ఆదేశం

బండ్లగూడ సీఐ, ఎస్సై, కానిస్టేబుల్ సస్పెండ్

చాంద్రాయణగుట్ట: పాతబస్తీలోని బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్, ఎస్సై, కానిస్టేబుల్ సస్పెండ్ కావడం చర్చనీయాంశంగా మారింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీఆర్‌పీఎఫ్ క్వార్టర్స్‌లో జనవరిలో మహిళా కానిస్టేబుల్ కారు పార్కు చేస్తున్న క్రమంలో పురుష ఉద్యోగి బహిరంగంగా మూత్ర విసర్జన చేశారు. ఈ విషయమై సదరు మహిళా కానిస్టేబుల్, మగ ఉద్యోగి నడుమ గొడవ జరిగింది. దీనిపై ఆమె ఫిర్యాదు మేరకు బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌లో నలుగురిపై కేసు సైతం నమోదయ్యింది. కేసు నమోదైన వారిని రిమాండ్ చేయాలని బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ షాకీర్ అలీ, సెక్టర్ ఎస్సై వెంకటేశ్వర్‌జీలకు పలుమార్లు అడిగినా సరైన స్థాయిలో స్పందించకపోవడంతో ఆమె విశ్రాంత మిలట్రీ ఉద్యోగైన తన భర్తతో కలిసి నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి ఇన్‌స్పెక్టర్, ఎస్సైలతో పాటు కానిస్టేబుల్ రమేశ్‌లను సీపీ సస్పెండ్ చేశారు. ఇందులో వెంకటేశ్వర్‌జీ మరో మూడు నెలల్లో పదవీ విరమణ కానున్నారు. గతంలో ఫలక్‌నుమా ఠాణాలో ఎస్సైగా పని చేసిన వెంకటేశ్వర్ జీతో పాటు బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ షాకీర్ అలీ వ్యవహార శైలి సైతం మొదటి నుంచి కూడా వివాదాస్పదంగా కొనసాగిందన్న ఆరోపణలు సైతం ఉన్నాయి.

ఆగిఉన్న బైక్‌ను ఢీకొట్టి..

ఇద్దరికి తీవ్ర గాయాలు

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై తమ్మలోనిగూడెం గేట్ సమీపంలో బైకులు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. మాల్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన కిషన్‌పల్లికి చెందిన మహేందర్ బుధవారం సాయంత్రం బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఆ క్రమంలో కిషన్‌పల్లి గేట్ వద్ద ఆయన బైక్‌ను నిలిపివేశాడు. మాల్ నుంచి యాచారం వెళ్తున్న నగరంలోని లెనిన్‌నగర్‌కు చెందిన యాదగిరి బైకుతో ఆగిఉన్న మహేందర్ బైకును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇరువురిని మాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనాస్థలిలో తీవ్రంగా గాయపడిన మహేందర్

ఆదిబట్ల చైర్మన్ ఎన్నికకు గ్రీన్‌సిగ్నల్

ఎన్నికల కమిషన్‌కు హైకోర్టు ఆదేశం

- కలెక్టర్‌కు ఉత్తర్వులు
- సమావేశానికి ఏర్పాట్లు చేస్తున్న యంత్రాంగం

ఇబ్రహీంపట్నం రూరల్: హైకోర్టు ఆదేశాలతో ఎట్టకేలకు ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికకు ఎన్నికల కమిషన్ పచ్చజెండా ఊపింది. ఈ మేరకు రంగారెడ్డి కలెక్టర్ శశాంక మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేక సమావేశం నిర్వహించి చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని బుధవారం సూచించారు. ఆదిబట్ల మున్సిపాలిటీలోని 15 వార్డుల కౌన్సిలర్లు గతంలో చైర్‌పర్సన్ కొత్త ఆర్తికగౌడ్, వైస్ చైర్‌పర్సన్ కోరే కళమ్మలపై అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన 13 మంది కౌన్సిలర్లు మూకుమ్మడిగా ఫిర్యాదు చేశారు. అనంతరం జనవరి 9వ తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆర్తికగౌడ్, కళమ్మలను తొలగించారు. అప్పటి నుంచి మున్సిపాలిటీ చైర్మన్, వైస్‌చైర్మన్ పీఠాలు ఖాళీగా ఉంది.

కోర్టు జోక్యంతో..

ఆదిబట్ల మున్సిపాలిటీ కొత్త చైర్మన్‌గా కావడానికి మర్రి నిరంజన్‌రెడ్డి శతవిధాలా ప్రయత్నం చేశారు. సొంత పార్టీకి చెందిన నాయకుడిపై అవిశ్వాసానికి పురిగొల్పడంతో ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ సైతం అయ్యారు. ఈ క్రమంలో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని పలుమార్లు నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. దీంతో జనవరి 9వ తేదీ నుంచి మార్చి నెల దాటినా నోటిఫికేషన్ ఇవ్వకపోవడంతో నిరంజన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. బుధవారం కోర్టు ఆదేశాలతో అధికార యంత్రాంగంలో చలనం మొదలైంది.



ఆదిబట్ల మున్సిపల్ కార్యాలయం

మే 6న ఎన్నిక

హైకోర్టు ఆదేశాలతో ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్ చర్యలు మొదలు పెట్టారు. మే 6న చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని కలెక్టర్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ప్రిసైడింగ్ అధికారిని నియమించి మే 4వ తేదీ వరకు అందరి కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేయాలని తెలిపారు. 6వ తేదీ ఉదయం చైర్మన్, మధ్యాహ్నం వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. ఇందుకోసం జిల్లా కలెక్టర్ అధికారిక ఉత్తర్వులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. దీంతో కొన్ని రోజులుగా ఎదురుచూస్తున్న ఆశావహులు ఆనందంలో మునిగి తేలుతున్నారు.

మళ్లీ క్యాంపునకు

చైర్మన్, వైస్ చైర్మన్ తొలగించడానికి ఏకంగా 20 రోజుల వరకు క్యాంపు రాజకీయాలు చేశారు. మళ్లీ తేది ప్రకటన కావడంతో క్యాంపులకు వెళ్లే ఆస్కారం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఇప్పటికే మర్రి నిరంజన్‌రెడ్డికి స్థానికంగా ఉన్న ఓ బడా ప్రజాప్రతినిధి అనుకూలంగా లేకపోవడంతో ఎవరి పైరవీల్లో వారు నిమగ్నమయ్యారు. ఈ దశలో మళ్లీ క్యాంపులకు వెళ్లక తప్పదని జోరుగా చర్చించుకుంటున్నారు.

అన్ని ఏర్పాట్లు చేస్తాం



జిల్లా కలెక్టర్, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పని చేస్తాం. అధికారికంగా ఎన్నికకు ఆదేశాలు జారీ చేశారు. 15 మంది కౌన్సిలర్లకు మే 4వ తేదీ వరకు ప్రత్యేక సమావేశం మెమోను అందజేస్తాం. 6న ప్రత్యేక సమావేశానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్, ఆదిబట్ల

కోర్టును ఆశ్రయించాం..



రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఇన్నాళ్లు తేది ఖరారు చేయడంలో జాప్యం జరిగింది. హైకోర్టు ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయడంతో అధికారుల్లో చలనం వచ్చింది. ప్రభుత్వంలో ఉండి కూడా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. 13 మంది కౌన్సిలర్లు నా వెంటే ఉన్నారు.

– మర్రి నిరంజన్‌రెడ్డి, 9వ వార్డు కౌన్సిలర్

పేలుడు పదార్థాల స్వాధీనం

ఇబ్రహీంపట్నం రూరల్: అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలను ఉపయోగిస్తున్నారని పక్కా సమాచారంతో ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. మంగళవారం రాత్రి తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని బ్రహ్మణపల్లి రోడ్డు సమీపంలో సామ రెసిడెన్సీ నందు రాళ్లకు రంధ్రాలు వేసి పేలుస్తున్నారనే సమాచారంతో మహేశ్వరం జోన్ ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. వెంకటేష్, తరుణ్, గణేష్ అక్రమంగా పేలుడు పదార్థాలు ఉపయోగించారు. ఈ మేరకు పోలీసులు వీరిని అరెస్టు చేశారు. 35 డిటోనేటర్లు, 35 జిలెటిక్స్ స్టిక్స్, మెగ్గర్‌బాక్స్ కనెక్టింగ్ కరెంట్ తీగలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

మియాపూర్: మియాపూర్ ప్రశాంత్ నగర్‌లోని శ్రీ సీతారామాంజనేయ దేవాలయంలో శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆలయంలో ఉదయం నుంచి సుప్రభాత సేవ, ద్వార తోరణ, కుంభారాధన, చతుష్టార్చన, వేదవిన్నపాలు, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల మధ్య శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి యంత్ర విగ్రహ విమాన శిఖర ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేశారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ హాజరయ్యారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

కోరుకున్న బైక్ కొట్టిస్తారు!



పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

- కస్టమర్లకు నచ్చిన సీసీ, కలర్ పల్సర్ బైక్‌ల దొంగతనం
- ఆన్‌లైన్‌లో విక్రయాలు
- ఐదు రోజులకొకటి చొప్పున 18 ద్విచక్ర వాహనాల అపహరణ
- స్థానికంగా అమ్మితే దొరికిపోతామని పక్క రాష్ట్రాల్లో విక్రయం
- ఎల్బీనగర్ పోలీసుల అదుపులో భరత్

సాక్షి, సిటీబ్యూరో: షోరూమ్‌లో మనకు నచ్చిన కలర్, సీసీ బైక్‌ను ఎలాగైతే కొనుగోలు చేస్తామో.. అచ్చం అదే తరహాలో కస్టమర్లు కోరుకున్న పల్సర్ బైక్‌ను చోరీ చేయడం భరత్ కుమార్ స్పెషాలిటీ. ఈ అంతర్రాష్ట్ర ఆటో మొబైల్ చోరుడితో పాటు కొట్టేసిన బైక్‌లను విక్రయిస్తున్న మరో నిందితుడి ఎల్బీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.18 లక్షలు విలువ చేసే 18 పల్సర్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎల్బీనగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ (డీఐ) సుధాకర్ బుధవారం కేసు వివరాలు వెల్లడించారు..

- కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన మల్లె భరత్ కుమార్ కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు. మద్యానికి బానిసైన అతను ఇళ్లల్లో చోరీలు, ఆటో మొబైల్ దొంగతనాలకు పాల్పడేవాడు. ఇప్పటి వరకు ఇతనిపై ప్రొద్దుటూరు పీఎస్‌లో పోక్సో కేసు, ఖాజీపేట పీఎస్‌లో 9 హెచ్‌బీ నైట్ చోరీ కేసులు, బద్వేల్ ఠాణాలో 4 మొటార్ సైకిల్ దొంగతనాల కేసులున్నాయి. ఇటీవల బద్వేల్ సబ్ జైలు నుంచి విడుదలయ్యాక హైదరాబాద్‌లోని మలక్‌పేటకు మకాం మార్చాడు.
- విలాసవంతమైన జీవితానికి అలవాటు పడిన భరత్ అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో ఫేస్‌బుక్‌లో సంగారెడ్డి జిల్లాకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వలిమోని చిన్నయ్య అలియాస్ కిట్టుతో పరిచయం అతడికి ఏర్పడింది. అతను సెకండ్‌హ్యాండ్ బైక్‌లు విక్రయిస్తుంటాడు. దీంతో ఇరువురు కలిసి బైక్ చోరీ, విక్రయాలను ప్రారంభించారు. హ్యాండిల్ లాక్ వేసి ఉన్న బైక్‌ను కూడా సునాయసంగా తీయడంలో భరత్ దిట్ట. ఇళ్ల ముందు, కాలనీలు, సందులలో పార్కింగ్ చేసిన వాహనాలను చోరీ చేసే భరత్ వాటిని కొన్నాళ్లపాటు మలక్‌పేటలోని తన ఇంటికి సమీపంలో దాచిపెట్టేవాడు.

ఐదు రోజులకొక బైక్ చోరీ..

ఇప్పటివరకు ఈ ముఠాపై సైబరాబాద్‌లో ఒకటి, హైదరాబాద్‌లో 7, రాచకొండలో 10 కేసులు న్నాయి. ఐదు రోజులకొకటి చొప్పున ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 18 పల్సర్ బైక్‌లను చోరీ చేశారు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు ఎల్బీనగర్ పీఎస్ పరిధిలోని డీఏం కాలేజీ సమీపంలో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి 18 పల్సర్ బైక్‌లతో పాటు మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాలోని రూ.22 వేల నగదును ఫ్రీజ్ చేశారు.

జంటపై దౌర్జన్యం.. సుమోటోగా కేసు నమోదు

చార్మినార్: రంజాన్ మార్కెట్ సందర్శనకు వచ్చిన ఓ గుర్తుతెలియని కుటుంబంపై మక్కా మసీదు గ్రానైట్ రోడ్డులో అమర్యాదగా, దురుసుగా ప్రవర్తించిన సంఘటనపై సుమోటో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని చార్మినార్ ఇన్‌స్పెక్టర్ కమతం చంద్రశేఖర్ తెలిపారు. రెండు రోజుల క్రితం ఓ మహిళ తన భర్తతో పాటు చిన్నారిని ఎత్తుకుని రంజాన్ మార్కెట్‌ను సందర్శించింది. మక్కా మసీదు రోడ్డులోని ఫుట్‌పాత్ వద్ద కొంత మంది ఆకతాయిలు వీరిని అడ్డుకుని అన్యమతస్తురాలిని ఎందుకు వివాహం చేసుకున్నావని దూషించి దౌర్జన్యానికి దిగారు. తన భర్తను కొట్టవద్దని వెంట ఉన్న భార్య బతిమిలాడినా పోకిరీలు వదిలి పెట్టలేదు. అందరూ చూస్తుండగా ఈ దౌర్జన్యం కొనసాగింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వెంటనే స్పందించిన దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు చార్మినార్ పోలీసులు సుమోటో కేసు నమోదు చేసుకుని సాంకేతిక ఆధారాలతో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఎలాంటి ఫిర్యాదు లేనప్పటికీ..4 ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు నిందితులను గుర్తించినట్లు సమాచారం.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని..

భార్యను కొట్టి చంపిన భర్త

జియాగూడ: మద్యం తాగేందుకు డబ్బులు కావాలంటూ భార్యతో గొడవపడి విచక్షణ రహితంగా కొట్టడంతో ఆమె మృతిచెందిన సంఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రామస్వామి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పోలీస్‌స్టేషన్ పరిధిలోని పన్నిపురా గుల్షన్ రసూల్ కాలనీలో అస్మా ఫాతిమా, సయ్యద్ అబ్దుల్ సలీమ్ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి నలుగురు సంతానం. సయ్యద్ అబ్దుల్ సలీమ్ సెంట్రింగ్ పని చేసేవాడు. మద్యానికి బానిసైన అతను డబ్బుల కోసం తరచూ భార్యపై దాడి చేసేవాడు. మంగళవారం రాత్రి సలీమ్ మద్యం తాగేందుకు డబ్బులు కావాలని భార్యతో గొడవకు దిగాడు. అస్మా ఫాతిమా డబ్బులు ఇవ్వకపోవడంతో ఆగ్రహానికి లోనైన అతను ఆమెను తీవ్రంగా కొట్టడమేగాక గోడకు తోసివేయడంతో అస్మా ఫాతిమా అపస్మారక స్థితికి చేరుకుంది. పక్క ఇంట్లో ఉంటున్న ఆమె సోదరి రిజ్వానా ఫాతిమాను ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. బుధవారం మధ్యాహ్నం అస్మా ఫాతిమా సోదరుడు సయ్యద్ అంజాద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఫొటో జర్నలిస్టులపై దాడులు అనైతికం

హిమాయత్‌నగర్: విధి నిర్వహణలో ఉన్న ఫొటో జర్నలిస్టులపై దాడి పత్రికా స్వేచ్ఛపై దాడి అని రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు అనుమళ్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.హరి అన్నారు. అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా ఢిల్లీ వీధుల్లో ఆమ్‌ఆద్మీ పార్టీ కార్యకర్తలు చేస్తున్న నిరసనలను కవర్ చేసేందుకు వెళ్లిన ఫొటో జర్నలిస్టులపై ఢిల్లీ పోలీసులు అకారణంగా దాడి చేసి తీవ్రంగా గాయపరచడం అమానుషమన్నారు. దీనిని తెలంగాణ రాష్ట్ర ఫొటోజర్నలిస్టుల సంఘం తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం దేశోద్ధారక భవన్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి కె.అనిల్‌కుమార్, కార్యవర్గ సభ్యులు నక్క శ్రీనివాస్, ఎం.డి.అలీముద్దీన్ నేతలు జి.బాలస్వామి, సయీద్ మజార్, ఇ.జనార్దన్‌రెడ్డి, రామకష్ణ, పిప్పళ్ల వెంకటేష్, సురేష్‌రెడ్డి, ఇ.నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల.. చెధరేలా!

- భారీగా పెరిగిన నిర్మాణ వ్యయం
- ఇసుక, స్టీల్, సిమెంట్ రేట్లు పైపైకి
- బెంబేలెత్తుతున్న సామాన్యులు

మొయినాబాద్‌రూరల్: ఇల్లు కట్టి చూడు, పెళ్లి చేసి చూడు అని పెద్దలు ఊరికే అనలేదు. ప్రస్తుతం రెండింటికి ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయి. ఫలితంగా సామాన్యుడి సొంతింటి కలకు అంతరాయం ఏర్పడుతోంది. రోజు రోజుకు భవన నిర్మాణ సామగ్రి ధరలు ఆకాశాన్ని తాకడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత మూడు నెలల నుంచి ఇసుక, డస్ట్, సిమెంట్, స్టీల్, టైల్స్, ఎలక్ట్రికల్స్, ప్లంబింగ్ తదితర సామగ్రి ధరలు భారీగా పెరిగాయి. ఇక మేస్త్రీలు, కూలీల రేట్లు సైతం ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో ఇల్లు కట్టుకోవాలంటేనే సామాన్య ప్రజలు జంకుతున్నారు.



హిమాయత్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం

ధరలకు రెక్కలు

భవన నిర్మాణ సామగ్రి ధరలకు రెక్కలొచ్చాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ఇసుక టన్నుకు రూ.2,500 నుంచి రూ.3 వేలు పలుకుతుంది. డస్ట్ గతంలో టన్నుకు రూ.650 దొరకగా ఇప్పుడు రూ.1,100కు పెరిగింది. స్టీల్ టన్ను రూ.55 వేల నుంచి 60 వేలకు ఎగబాకింది. సిమెంట్ ధరలు బస్తాకి కంపెనీ బట్టి రూ.330 నుంచి రూ.400 వరకు నడుస్తుంది. జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలు, పట్టణ, మండల కేంద్రాలలో గతంలో పోలిస్తే ధరలు బాగా పెరిగాయి. దీంతో నిర్మాణాలు కాస్తా మందగించాయి. పనులు లేక కార్మికులు, కూలీలు, మేస్త్రీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇసుక, డస్ట్ ధరలు తగ్గితే బాగుంటుందని నిర్మాణదారులు ఆశతో ఎదురు చూస్తున్నారు. కంపెనీలు పెంచిన ధరల కంటే స్థానిక వ్యాపారులు మరింత పెంచి విక్రయాలు చేపడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక మరింత పిరం

నిర్మాణాల్లో ఇసుకకు అధిక ప్రాధాన్యం ఉంది. ఇసుక ధరలు రోజు రోజుకు మారుతున్నాయి. టన్ను ఇసుక సాధారణ రకం రూ.2,500 నుంచి రూ.3 వేల వరకు విక్రయిస్తున్నారు. ప్లాస్టింగ్‌కు ఉపయోగించే ఇసుక(సన్నరకం) సుమారు రూ.3 వేల నుంచి రూ.3500 వరకు అమ్ముతున్నారు. ఈ ధరలు గత మూడు నెలల నుంచి అమాంతంగా పెరుగుతూ వచ్చాయి. గ్రామాలలో వర్షాలు బాగా కురవడంతో ఇసుక లారీలు వాగుల్లోకి వెళ్లడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇసుక కొరత ఉంది. అదే విధంగా పునాదికి ఉపయోగించే గ్రానైట్ రాయి ధరలు కూడా పెరిగాయి. స్లాబ్‌కు వినియోగించే కంకర గతంలో టన్నుకు రూ.1,500 ఉండగా ప్రస్తుతం రూ.2 వేల వరకు విక్రయిస్తున్నారు.

షాక్ కొడుతున్న ఎలక్ట్రికల్ సామగ్రి

ఇళ్లకు వినియోగించే ఎలక్ట్రికల్, ప్లబింగ్ వస్తువుల ధరలు సైతం పెరిగాయి. గతేడాదితో పోలిస్తే 20–30 శాతం పెరిగాయని వినియోగదారులు చెబుతున్నారు. అంతేకాకుండా ఫ్లోరింగ్, టైల్స్ ధరలు కూడా విపరీతంగా పెరిగాయని పేర్కొంటున్నారు. ఇలా నిర్మాణాలకు ఉపయోగించే ప్రతి వస్తువు ధర పెరిగాయని ఇళ్లు నిర్మించే ప్రజలు వాపోతున్నారు. దీంతో బిల్డర్లు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేద ప్రజలు ఇళ్లు నిర్మించుకునేలా ధరలను నియంత్రిస్తే బాగుంటుందని పేర్కొంటున్నారు.

పనులు తగ్గాయి



ఇళ్ల నిర్మాణంలో ఉపయోగించే ఇసుక, సిమెంట్, డస్ట్, స్టీల్ ధరలు పెరగడంతో నిర్మాణాలు కాస్తా తగ్గించారు. పెరిగిన ధరలతో పనులు అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి. ప్రభుత్వం పెరిగిన ధరలను వెంటనే నియంత్రించాలి.

– యాదయ్య, కాంట్రాక్టర్, హిమాయత్‌నగర్

నియంత్రణ ఉండాలి



పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలతో ఇల్లు కట్టాలంటే భయం వేస్తుంది. సామగ్రి ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. దీంతో సొంతింటి కల కలగానే మారింది. భవన నిర్మాణ సామగ్రి ధరలపై నియంత్రణ విధించాలి.

– తిరుపతిరెడ్డి, బాకారం